# 45. ఏడకేడ నీ చెరితలు

ఏడకేడ నీ చెరితలు ఏమని పొగడవచ్చు
ఈడు లేని మహిమల ఇనవంశ రామా ॥ ఏడకేడ ॥

పరమాన్నములో బుట్టి పక్కన తాటకిఁ జంపి
సరుస విశ్వామిత్రు యజ్ఞముఁ గాచి
హరుని విల్లువిరిచి అట్టే సీతఁ బెండ్లాడి
పరశురాముని చేత బలము చేకొంటివి ॥ ఏడకేడ ॥

వైపుగ సుగ్రీవు గూడి వాలి నొక్క కోల నేసి
ఏపున జలధిని గట్టి ఎసగితివి
దీపించు రావణుఁ జంపి దివిజులను మన్నించి
ఏపుగ విభీషణుని రాజ్యమేలించితివి ॥ ఏడకేడ ॥

సీతతో పుష్పక మెక్కి జిగిని అయోధ్యకు వచ్చి
గాతల రాజ్యపట్టముఁ గట్టుకొంటివి
ఈతల శ్రీవేంకటాద్రి నిటు విజయనగరాన
సీతతో నెలవుకొని నెగడితివి ॥ ఏడకేడ ॥